సాక్షి
అనంతపురం

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.32 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32 వేలు పలికాయి.




టమాట కిలో రూ.10

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10, కనిష్టం రూ.3, సరాసరి రూ.7 ప్రకారం అమ్ముడుపోయాయి.

గరిష్టం/కనిష్టం
41.1°/22.4°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఎండలు పెరగడంతో ఉక్కపోత కొనసాగుతోంది.



న్యూస్‌రీల్

త్వరలోనే జొన్నల పంపిణీ



జొన్నల స్టాక్ పాయింట్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

గుంతకల్లు రూరల్: బియ్యం కార్డుదారులకు త్వరలోనే రేషన్‌షాపుల నుంచి జొన్నల పంపిణీ చేపట్టనున్నట్లు జేసీ కేతన్‌గార్గ్ తెలిపారు. శనివారం గుంతకల్లులో పర్యటించిన ఆయన బళ్లారి రోడ్డులోని గోడౌన్‌లో నిల్వ ఉంచిన జొన్నలను, వాటి నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంతకల్లు నియోజకవర్గంలో ఇప్పటివరకూ 70 మెట్రిక్ టన్నుల జొన్నలను రైతుల నుంచి సేకరించినట్లు చెప్పారు. బియ్యం కార్డులోని ప్రతి సభ్యుడికీ రెండు కిలోల జొన్నలు, మూడు కిలోల బియ్యం చొప్పున పంపిణీ చేస్తామన్నారు. గుంతకల్లు మండలం నక్కనదొడ్డి ఐఓసీఎల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంకు పనులను తనిఖీ చేశారు. తహసీల్దార్ రాము, సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శేష వాహనంపై శివపార్వతుల ఊరేగింపు

కూడేరు: దక్షిణ భారతదేశంలోనే ప్రఖ్యాతిగాంచిన కూడేరులోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శేష వాహనంపై ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అంతకుముందు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో సంగమేశ్వర స్వామి ఆలయం నుంచి తీసుకువచ్చారు. కార్యక్రమంలో రెడ్డి కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెచ్చగొడుతూ..రచ్చ చేస్తూ..

- దారి తప్పుతున్న లోకేష్ 'యువగళం'
- స్థానిక టీడీపీ నేతల స్క్రిప్టుతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు
- కదిరి, పెనుకొండ, రాప్తాడులోనూ మతిలేని విమర్శలు
- టీడీపీ శ్రేణులను వైఎస్సార్‌సీపీ నేతలపైకి ఉసిగొల్పుతున్న వైనం
- తాజాగా పుట్టపర్తిలో ఉద్రిక్తతలకు ఆజ్యం

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర ఘర్షణలకు ఆజ్యం పోస్తోంది. అధికార పక్షం నేతలపై వ్యక్తిగత విమర్శలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ఉద్రిక్తతలకు కారణమవుతున్నారు. సమృద్ధిగా కురిసిన వర్షాలకు పైరు పంటలతో ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో ఒక్కసారిగా అలజడి రేపుతున్నారు. అందరూ కలసిమెలసి పనులు చేసుకుంటూ ముందుకు సాగుతున్న వేళ కలహాలు సృష్టిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను, సమన్వయకర్తలను బూతులు తిడుతూ వారిపై టీడీపీ శ్రేణులను ఉసిగొల్పుతున్న తీరు విమర్శలకు తావిస్తోంది.





ప్రశాంత వాతావరణంలో చర్చించడానికి వచ్చినట్లు డీఎస్పీకి చెబుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పల్లె సమక్షంలో అలజడి సృష్టిస్తున్న టీడీపీ కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఐదు రోజుల క్రితం ఉమ్మడి అనంతపురం జిల్లా పుట్టపర్తిలో కొనసాగింది. ఈ సందర్భంగా లోకేష్ స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేశారు. ఆరోపణలు నిరూపించాలంటూ ఎమ్మెల్యే దుద్దుకుంట సవాల్ విసిరారు. దీనికి మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి ప్రతిస్పందించారు. శనివారం తన అనుచరులతో పుట్టపర్తిలోని సత్యమ్మ గుడి వద్దకు వెళ్లి వాహనంపైకి ఎక్కి తొడగొట్టారు. కవ్వింపు చర్యలకు దిగారు. తన అనుచరులను రెచ్చగొట్టారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి శాంతియుతంగా చర్చించడానికి అక్కడ సిద్ధంగా ఉన్నప్పటికీ 'పల్లె' మాత్రం ఉద్రిక్తతలకు ఆజ్యం పోశారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణాన్ని సృష్టించారు. పోలీసులు నచ్చజెబుతున్నా వినకుండా ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నించారు.

కదిరి నుంచి ఇదే పంథా..

లోకేష్ పాదయాత్ర కదిరి నియోజకవర్గంలో అడుగు పెట్టినప్పటి నుంచి రెచ్చగొట్టే ధోరణితోనే ముందుకు సాగుతున్నారు. స్థానిక ఎమ్మెల్యేను రెచ్చగొట్టడం, కార్యకర్తల మధ్య చిచ్చుపెట్టడం, ఇరు వర్గాల వారూ కొట్టుకునేలా ప్రేరేపించడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కదిరిలో ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, ఆ తర్వాత పెనుకొండలో ఎమ్మెల్యే శంకరనారాయణపైనా అర్థపర్థం లేని ఆరోపణలు చేశారు. రాప్తాడులో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని కించపరుస్తూ మాట్లాడారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రశాంతంగా ఉన్న జిల్లాలో కక్షలు, కార్పణ్యాలకు లోకేష్ ఆజ్యం పోస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

స్థానిక నేతల స్క్రిప్టుతో..

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో స్థానిక పరిస్థితులపై లోకేష్‌కు అవగాహన లేదు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు రాసిచ్చిన ఏకపక్ష స్క్రిప్టులు చదువుతూ పోతున్నారు. స్థానిక సమస్యలపై అవగాహన ఉంటే ఇదంతా చేసేవారు కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పాదయాత్రలో భాగంగా సభలు నిర్వహించడం, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలపై ఉన్నవీ లేనివీ కల్పించి ఆరోపణలు సంధించడం, అక్కడ గొడవలు సృష్టించడం.. వారం రోజులుగా ఇదే ధోరణి కొనసాగుతోంది. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసినా ఎక్కడా రెచ్చగొట్టిన సందర్భాలు లేవని, ప్రభుత్వ వైఫల్యాల మీద మాత్రమే మాట్లాడేవారని, అప్పట్లో పాదయాత్ర హుందాగా జరిగిందని, జనం కూడా స్వచ్ఛందంగా, తరలివచ్చారని ప్రజలు గుర్తు చేస్తున్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో ఏడు చెక్‌పోస్టులు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

రాయదుర్గం: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పటిష్టం చేశామని కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాల్లోని కర్ణాటక సరిహద్దునున్న మండలాల్లో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అక్రమంగా డబ్బు, మద్యం, మారణాయుధాలు, పేలుడు పదార్థాలు తరలకుండా నిరంతరం నిఘా ఉంచేలా చర్యలు చేపడతామన్నారు. ఈ విషయంలో 24 గంటలూ అప్రమత్తంగా ఉండేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు చెక్‌పోస్టులు తెరిచే ప్రాంతాలను సందర్శించామన్నారు. కర్ణాటకలో ఎన్నికలు పూర్తయ్యే వరకూ ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఖాద్రీశుని కల్యాణం.. భక్తులకు అవకాశం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆర్జిత కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాన్ని దగ్గరుండి జరిపించే అవకాశాన్ని భక్తులకూ కల్పించినట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టిక్కెట్ రూ.4 వేలు ఉంటుందని, ఒక్క టిక్కెట్‌పై ఐదుగురికి మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. ఈ నెల 10, 11, 12, 13, 14, 16, 17, 18, 21, 23, 24, 26, 27, 28, 30 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి కల్యాణోత్సవం ఉంటుందని, ఆసక్తి గలవారు ఆయా తేదీల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సూక్ష్మసాగులో 'అనంత' అగ్రస్థానం

- డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరులో రాష్ట్రంలోనే టాప్
- 125 శాతంతో 13,697 హెక్టార్లకు బిందు, తుంపర సేద్యం యూనిట్లు
- తాజాగా 2023-24లో 16 వేల హెక్టార్లకు ప్రతిపాదించిన ఏపీఎంఐపీ



కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రంలో స్ప్రింక్లర్ల ద్వారా వేరుశనగ సాగు చేస్తున్న రైతు నారాయణ

అనంతపురం అగ్రికల్చర్: వరుణుడు కరుణించడంతో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. భూగర్భజలాలు వృద్ధి చెందాయి. పండ్లతోటలు, కూరగాయలు ఇతర ఉద్యాన పంటల సాగు గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలో సూక్ష్మసాగు పరికరాలకు గిరాకీ ఏర్పడింది. జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు అన్నదాతలకు అండగా నిలిచి ప్రోత్సాహమందిస్తోంది. అందులో భాగంగా మార్చి 31తో ముగిసిన 2022-23లో సూక్ష్మసాగు సేద్యానికి (డ్రిప్, స్ప్రింక్లర్లు) పెద్దపీట వేసి రైతులకు మేలు చేకూర్చింది. ఐదు ఎకరాల్లోపున్న ఎస్సీ, ఎస్టీ సన్నచిన్నకారు రైతులకు 90 శాతం, మిగతా రైతులకు 70 శాతం రాయితీపై డ్రిప్ (బిందు) యూనిట్లు, ఎస్సీ, ఎస్టీ సన్నచిన్న కారు రైతులకు 55 శాతం, ఇతరులకు 45 శాతం రాయితీపై స్ప్రింక్లర్ల (తుంపర) యూనిట్లకు రాయితీ వర్తింపజేసి మంజూరు చేసింది.

125 శాతం లక్ష్యసాధన

ఈ ఏడాది (2022-23) 11 వేల హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు ఇవ్వాలని జిల్లాకు లక్ష్యం నిర్దేశించారు. 30,608 మంది రైతులు 40,693 హెక్టార్లకు సూక్ష్మసాగు పరికరాలు కావాలని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ రైతులే 4,400 మంది ఉన్నారు. లక్ష్యానికి మించి డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు చేయడంలో ఏపీఎంఐపీ అధికారులు విజయవంతమయ్యారు. 125 శాతం లక్ష్య సాధనతో 11,079 మంది రైతులకు 13,897 హెక్టార్లకు మంజూరు చేశారు.

రాష్ట్రంలోనే 'అనంత' ప్రథమం

లక్ష్యానికి మించి రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు చేసిన అనంతపురం జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 10,754 హెక్టార్లతో అన్నమయ్య జిల్లా రెండో స్థానంలో నిలవగా.... వైఎస్సార్, శ్రీసత్యసాయి, ప్రకాశం జిల్లాలు మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. ఇక దేశవ్యాప్తంగా టాప్ 25 జిల్లాల గణాంకాలు తీసుకుంటే అనంతపురం జిల్లా ఆరో స్థానంలో ఉండటం విశేషం. బనాస్‌కాంత (గుజరాత్), జల్‌గావ్ (మహారాష్ట్ర), జాలోర్, గంగానగర్ (రాజస్థాన్), బివానీ (హర్యానా) జిల్లాలు మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. టాప్ 25 జాబితాలో ఆరో స్థానంలో అనంతపురం జిల్లా ఉండగా... శ్రీసత్యసాయి జిల్లా 11వ స్థానం, వైఎస్సార్ 14వ స్థానం, ప్రకాశం జిల్లా 18వ స్థానాల్లో ఉన్నట్లు నివేదిక వెల్లడిస్తోంది.

16 వేల హెక్టార్లకు ప్రతిపాదన



డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరులో రాష్ట్రంలో తొలి స్థానం, దేశంలో ఆరో స్థానం సంపాదించడం ఆనందంగా ఉంది. ఇందుకు సహకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి, జిల్లాకు చెందిన మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు రైతుల తరపున ధన్యవాదాలు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది సహకారంతో సకాలంలో రైతులకు మంజూరు చేశాం. ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో 16 వేల హెక్టార్లకు సరిపడా డ్రిప్, స్ప్రింక్లర్లు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే అమలు చేస్తాం.

– జి.ఫిరోజ్‌ఖాన్, ఏపీఎంఐపీ జిల్లా అధికారి

రేపే టెన్త్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ

రాప్తాడురూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే విద్యాశాఖ అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. ముఖ్యంగా జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎం.సాయిరామ్ ఏర్పాట్ల విషయంలో ఎక్కడా రాజీపడకుండా ప్రత్యేక దృష్టి సారించారు. డిప్యూటీ డీఈఓలు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, మండల విద్యాశాఖ అధికారులతో తరచూ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఏర్పాట్ల విషయమై ప్రతి కేంద్రం గురించి ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. ప్రతి కేంద్రంలోనూ పూర్తిస్థాయిలో ఫర్నీచరు, తాగునీరు, మరుగుదొడ్లు (నీటి వసతితో), కరెంటు సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకున్నారు. నాడు-నేడు కార్యక్రమంతో మౌలిక వసతుల అంశంలో ప్రభుత్వ స్కూళ్లు కార్పొరేట్‌ను తలదన్నేలా ఉన్నాయి. జిల్లాలో మొత్తం 139 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. 35,305 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొత్తం 2,094 మంది ఇన్విజిలేటర్లను విధులకు నియమించారు. ఇన్విజిలేషన్ విధులను రద్దు చేయించుకునేందుకు పలువురు డీఈఓ వద్దకు క్యూ కట్టారు. ఈ విషయంలో డీఈఓ కఠినంగానే వ్యవహరిస్తున్నారు. నిజంగా ఆరోగ్యం, ఇతర కుటుంబ సమస్యలు ఉండి విధులకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉన్నవారికి మినహాయింపు ఇచ్చారు.



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఈఓ సాయిరామ్

అందరూ సహకరించాలి : డీఈఓ

పదో తరగతి పరీక్షల నిర్వహణ విధులకు నియమించిన అందరూ సహకరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్ విజ్ఞప్తి చేశారు. శనివారం సీఎస్, డీఓ, ఎంఈఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనవసరంగా ఇన్విజిలేషన్ విధుల నుంచి తప్పుకోవద్దన్నారు. విద్యార్థుల విషయంలో బాధ్యత తీసుకోవాలన్నారు. అన్ని కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. స్క్రైబ్స్‌గా 9వ తరగతి విద్యార్థులను తీసుకోవాలన్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించొద్దన్నారు. విధులకు వచ్చే పోలీసులు, వైద్య సిబ్బంది వద్ద కూడా సెల్‌ఫోన్లు ఉండకూడదన్నారు. విద్యార్థులు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

• వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం

విడపనకల్లు: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని కరకముక్కలలో శనివారం చెన్నకేశవ స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎంపీపీ కరణం పుష్పావతి, సర్పంచు రామాంజనరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున తదితరులు చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అలాగే ఎంపీ గోరంట్ల మాధవ్ హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

జనం నడుమ రథోత్సవం



వైద్యవిధాన పరిషత్‌లో నలుగురిపై సస్పెన్షన్ వేటు

- అదనపు సంపాదన కోసం అడ్డదారి
- ఐటీఐ అర్హత లేకున్నా ప్లంబర్ పోస్టులు
- నకిలీ సర్టిఫికెట్లతో వ్యవహారం చక్కబెట్టిన వైనం
- అనర్హులకు ఉద్యోగాలు ఇప్పించడంలో ఆ నలుగురి ప్రమేయం

అనంతపురం సప్తగిరి సర్కిల్: వైద్య విధాన పరిషత్‌లో నలుగురు ఉద్యోగులపై వేటు పడింది. నకిలీ సర్టిఫికెట్లతో పలువురికి ఉద్యోగాలు ఇప్పించారని విచారణలో తేలడంతో వారిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య విధాన పరిషత్‌లో ఖాళీల భర్తీకి సాధారణంగా నోటిఫికేషన్ విడుదల చేసి.. మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సంబంధిత విభాగానికి అభ్యర్థులు లేని పక్షంలో.. ఇతర అభ్యర్థులకు అవకాశం కల్పించడం ఆనవాయితీ. ఇదే వైద్య విధాన పరిషత్‌లో విధులు నిర్వహిస్తున్న జగదీష్ నాయక్, మహబూబ్ బాషా, పురుషోత్తం, సంజీవ్ కుమార్ గౌడ్‌కు వరంగా మారింది. అక్రమ సంపాదన కోసం అనర్హులతో పోస్టులు భర్తీ చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్లంబర్ ఉద్యోగాలకు ఐటీఐ విద్యార్హత అవసరం. అయితే సదరు అభ్యర్థులు ఐటీఐ చేయకపోయినా.. డబ్బు ఇస్తే ఆ సర్టిఫికెట్లు తామే సమకూరుస్తామని చెప్పారు. ఆ మేరకు నకిలీ సర్టిఫికెట్లతో సదరు అభ్యర్థులతో దరఖాస్తు చేయించి మెరిట్ జాబితాలో చేర్చి.. ఉద్యోగం వచ్చే వరకు ఆ నలుగురు ఉద్యోగులూ వ్యవహారాన్ని చక్కబెట్టారు. ఉద్యోగాల్లో చేరిన వారికి కొన్ని నెలల తర్వాత జీతాలు రాలేదు. దీంతో వారు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేసి.. ఆందోళనలకు దిగారు. తన నుంచి డబ్బు తీసుకుని ఉద్యోగం ఇప్పించారని, జీతం రాని ఈ ఉద్యోగం తనకు వద్దని.. తన డబ్బు వెనక్కు ఇప్పించాలని రాయదుర్గం ఆస్పత్రిలో పనిచేస్తున్న మహేష్ ఉన్నతాధికారులను కోరాడు. దీంతో ఈ వ్యవహారం కాస్తా బయటకు వచ్చింది. ఈ ఏడాది జనవరి 28న 'వైద్య విధాన పరిషత్‌లో నకిలీలు' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మొత్తం ఏడుగురికి ప్లంబర్ ఉద్యోగాలు కల్పించగా.. అందులో ఐదుగురు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్లు విచారణలో గుర్తించారు. ఉద్యోగులు జగదీష్ నాయక్, మహబూబ్ బాషా, పురుషోత్తం, సంజీవ్‌కుమార్ గౌడ్ విధుల్లో అలసత్వం వహించి.. అనర్హులకు ఉద్యోగాలు రావడానికి సహకారం అందించినట్లు తేలడంతో వీరిని కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు డీసీహెచ్ఎస్ కృష్ణవేణి తెలిపారు.

క్లుప్తంగా

'జాబిలి'కి నెల్సన్ మండేలా పురస్కారం



చాంద్‌బాషా అందుకున్న ప్రశంసాపత్రం

పెనుకొండ: వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తున్న నెల్సన్ మండేలా శాంతి పురస్కారం... ఈ ఏడాది పెనుకొండకు చెందిన ప్రముఖ కవి, ఉపాధ్యాయుడు జాబిలి చాంద్‌బాషాకు దక్కింది. శుక్రవారం రాత్రి ఆయనకు వర్చువల్ విధానంలో ప్రశంసాపత్రాన్ని మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.చక్రవర్తి అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుత్తి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని రైలు పట్టాలపై శనివారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కారుకు నిప్పు


దగ్ధమైన కారును పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

తాడిపత్రి అర్బన్: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఓ కారు పాక్షికంగా కాలిపోయింది. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలోని నందలపాడుకు చెందిన వీరాంజనేయాచారి ఓ కారును ఏర్పాటు చేసుకుని అద్దెకు తిప్పుతూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి ఇంటికి చేరుకున్న ఆయన.. తన కారును ఇంటి పక్కన ఆపి నిద్రపోయాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత కారుకు మంటలు వ్యాపించాయి. గమనించిన వీరాంజనేయాచారి వెంటనే మంటలను ఆర్పేశాడు. అప్పటికే కారు పాక్షికంగా కాలిపోయింది. రాత్రి గస్తీ విధుల్లో ఉన్నటువంటి యల్లనూరు ఎస్ఐ రామకృష్ణ అక్కడకు చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడం వల్లనే ఈ ఘటన చోటు చేసుకుందని బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు తాడిపత్రి అర్బన్ ఎస్ఐ ధరణీబాబు తెలిపారు.

ఇలా చేస్తే 'పది'ంతల విజయం

ప్రతి విద్యార్థి చదువుల పయనంలో పదోతరగతి కీలకం. పాఠశాల చదువు పూర్తి చేసుకుని కళాశాలలోకి తొలి అడుగు పడాలంటే ఈ పరీక్షల్లో రాణించాలి. ఉత్తీర్ణతే కాదు.. ఉత్తమ ఫలితమూ సాధించినప్పుడే ఆశించిన కళాశాలలో చోటు దక్కుతుంది. ఇంతటి కీలకమైన పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. కేవలం ఒక్కరోజు మాత్రమే గడువు ఉండడంతో విద్యార్థుల్లో సహజంగానే ఆందోళన మొదలైంది. అయితే తక్కువ సమయమే అయినా మనసుపెట్టి ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. పరీక్షలకు ఎలా సిద్ధం కావాలనే అంశంపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు

రాప్తాడు రూరల్: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్ని ఆరు సబ్జెక్టులకు మాత్రమే నిర్వహించనున్నారు. ఈ నెల మూడో తేదీ నుంచి 18వ తేదీ వరకూ నిర్దేశిత రోజుల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాయనున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థిలోనూ సహజంగానే భయం, ఆందోళన నెలకొన్నాయి. ప్రశ్న పత్రం ఎలా ఉంటుంది? జవాబులు ఎలా రాయాలి? ఎన్ని మార్కులు వస్తాయి? తదితర ఎన్నో ప్రశ్నలు విద్యార్థులను అయోమయానికి గురి చేస్తున్నాయి. పరీక్షల తేదీ దగ్గర పడేకొద్దీ ఆందోళన ఎక్కువై ప్రశాంతత లేకుండా పోతుంది.

ప్రశాంతతతోనే ఆశించిన ఫలితాలు

పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మానసిక ప్రశాంతతతోనే ఆశించిన ఫలితాలు ఉంటాయంటున్నారు. ఇంటి నుంచి పరీక్ష కేంద్రానికి వెళ్లే సమయంలో పుస్తకాలు చదవడం వల్ల ఎలాంటి ఫలితమూ ఉండదంటున్నారు. 'పరీక్ష కేంద్రానికి వెళ్లిన తర్వాత కొద్దిపాటి సమయం ఉంటే ఇంపార్టెంట్, హార్డ్ వర్క్స్ నోట్స్ మాత్రమే పైపైన చూసుకోవాలి. పరీక్షకు బాగా ప్రిపేర్ అయినట్లు మానసికంగా సిద్ధంగా ఉండాలి. పరీక్షలు బాగా రాస్తామనే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి. మిమ్మల్ని మీరే ప్రోత్సహించుకోవాలి. రాత్రిపూట ఎక్కువ సమయం మెలుకువతో ఉండకుండా చూసుకోవాలి. సరైన నిద్రలేకపోతే ఒత్తిడికి గురయ్యే ప్రమాదముంది' అని హెచ్చరిస్తున్నారు.


రోజూ ఇలా చేస్తే సరి

రాత్రి 10 గంటల్లోపు చదువు పూర్తి చేసి ప్రశాంతంగా నిద్రపోవాలి. మరుసటి రోజు తెల్లవారుజామున 5 గంటలకు నిద్రలేచి కాసేపు చదువుకోవాలి. పరీక్షకు వెళ్లేటప్పుడు పరిశుభ్రమైన దుస్తులను ధరించాలి. పాతదైనా పర్వాలేదు కానీ శుభ్రంగా ఉతికి ఇస్త్రీ చేసుకుని వేసుకోవాలి. తల నీటుగా దువ్వుకోవాలి. దీని వల్ల ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. పరీక్షకు వెళ్లేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ శరీరానికి బిగుతుగా ఉండే దుస్తులను ధరించొద్దు. సాధ్యమైనంత వదులుగా ఉండే దుస్తులే వేసుకోవాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. అతిగా తిని వెళ్లొద్దు. ఓ గ్లాసు వేడిపాలు తాగితే ఎంతో శక్తి, ఉత్సాహం కలుగుతుంది.

పరీక్ష రోజు ఇలా చేయండి

పరీక్ష రోజు చాలా ఆత్మవిశ్వాసంతో ఉండాలి. బాగా చదివానని, సమాధానాలు బాగా రాస్తాననే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. మనసులో ఎలాంటి అలజడి ఉండరాదు. నిర్దేశించిన సమయంలో కొన్ని టెక్నిక్స్‌తో తెలివితేటలు ప్రదర్శించి జవాబులు రాయాలి. ముందుగానే హాల్ టికెట్ భద్రపరచుకోవాలి. ప్యాడ్‌తో పాటు కొత్త పెన్నులు, పెన్సిల్ తీసుకెళ్లడం మర్చిపోవద్దు. పరీక్ష సమయానికి కనీసం అరగంట ముందు కేంద్రానికి చేరుకోవాలి. దీనివల్ల మానసిక ఆందోళనకు గురికాకుండా ఉంటారు.

ఈ జాగ్రత్తలు పాటించండి

అక్షరాలు మరీ చిన్నవిగా, మరీ పెద్దవిగా కాకుండా స్పష్టంగా అర్థమయ్యేలా రాయండి. ప్రశ్నకు సరైన సమాధానం రాసేందుకు ప్రయత్నించండి. జవాబు రాసేటప్పుడు అనవసరమైన చోట సబ్ హెడ్డింగ్ పెట్టొద్దు. అవసరమైన చోటు మాత్రమే సబ్ హెడ్డింగ్స్ పెట్టండి. ఇలా రాయడం వల్ల ఎక్కువ మార్కులు పొందేందుకు అవకాశం ఉంటుంది. జవాబు పత్రంలో సాధ్యమైనంత వరకు కొట్టివేతలు ఉండరాదు. జవాబులు నీటుగా రాయడం అలవాటు చేసుకోవాలి. జవాబు పత్రంలో ఒకే మాదిరి జవాబులు రాయొద్దు. పైనుంచి చివరి వరకు పేరాగ్రాఫ్ విభజన చేసి జవాబులు రాయడం మంచిది. ఏదైనా కొత్త పాయింట్ రాసేటప్పుడు మరో పేరాగ్రాఫ్‌ను ప్రారంభించాలి. పది లైన్లకు మించి పేరాగ్రాఫ్ ఉండరాదు.

ప్రశ్నలను అర్థం చేసుకోవాలి

ఇన్విజిలేటర్ అందజేసే ప్రశ్నాపత్రాన్ని హడావుడిగా కాకుండా ప్రశాంతంగా పరిశీలించి, ప్రశ్నలను బాగా అర్థం చేసుకోవాలి. ముందుగానే ఊహించిన ప్రశ్నలు వచ్చినప్పుడు తొలుత వాటికి జవాబులు రాయాలి. ప్రతి జవాబు చెక్ చేసుకునేందుకు కొన్ని నిమిషాలు కేటాయించుకోవాలి. ఊహించని ప్రశ్న ఎదురైతే ఏ మాత్రం నిరుత్సాహానికి గురికాకూడదు.

బాలుడి అప్పగింత

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పాఠశాల నుంచి తప్పిపోయిన ఓ బాలుడు.. పోలీసుల జోక్యంతో సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేరాడు. వివరాలు... అనంతపురంలోని సాయినగర్ మొదటి క్రాస్‌లో నివాముంటున్న బండారి రవీంద్ర, లక్ష్మి దంపతులకు నలుగురు పిల్లలు ఉన్నారు. ఇటీవల కరోనా బారిన పడి రవీంద్ర మృతి చెందాడు. నలుగురి పిల్లల్లో మతి స్థిమితం సరిగా లేని మానేష్‌ను రామ్‌నగర్‌లోని వికాస విహార మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలల్లో తల్లి చదివిస్తోంది. శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన ఆ బాలుడు సాయంత్రం ఇంటికి చేరుకోలేదు. దీంతో కుమారుడు కనిపించడం లేదంటూ నాల్గో పట్టణ పోలీసులకు లక్ష్మి ఫిర్యాదు చేసింది. వెంటనే హై అలర్ట్ యాప్ ద్వారా నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేసి, విస్తృత గాలింపు చేపట్టారు. రాజీవ్ కాలనీ పంచాయతీ మహదేవ్‌నగర్‌లో బాలుడిని గుర్తించి, త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసుల సహకారంతో నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్‌కు పిలుచుకు వచ్చి శనివారం తల్లి లక్ష్మికి అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా కంప్యూటర్ శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నారు. ఈ మేరకు సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, బేసిక్ ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ అంశాలపై 60 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. ఇంటర్ ఉత్తీర్ణత కలిగి డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ పాస్/ఫెయిల్ అయిన 20 నుంచి 30 ఏళ్ల లోపు వయసున్న మహిళలు మాత్రమే అర్హులు. శిక్షణ సమయంలో మధ్యాహ్న భోజనం అందజేస్తారు. శిక్షణ పూర్తికాగానే సర్టిఫికెట్ అందజేస్తారు. పూర్తి వివరాలకు 77807 52418లో సంప్రదించవచ్చు.

పర్యవేక్షణ లేకపోతే ఎలా?

- వైద్యాధికారులపై కలెక్టర్ నాగలక్ష్మి ఫైర్
- ఎన్‌సీడీ, సీడీ వ్యాధుల సర్వేపై నిర్లక్ష్యం వీడాలని హితవు
- సాంకేతిక సమస్య పేరుతో తప్పించుకోవాలనుకుంటే సహించబోనంటూ హెచ్చరిక



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం సప్తగిరిసర్కిల్: 'కింది స్థాయి సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ లేకపోతే ఎలా?' అంటూ వైద్యాధికారులపై కలెక్టర్ నాగలక్ష్మి అసహనం వ్యక్తం చేశారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ), కమ్యూనికబుల్ డిసిజెస్(సీడీ) సర్వేపై శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వైద్యాధికారులతో కలసి ఆమె సమీక్షించారు. సర్వే నివేదికల రూపకల్పనలో వైద్యాధికారులు విఫలం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే జ్ఞానం కూడా లేదా? అంటూ మండిపడ్డారు. అడిగిన ప్రతిసారీ కుంటి సాకులు చెప్పి తప్పించుకోడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. రోజు వారీ నివేదికలు ఎందుకు తెప్పించుకోలేకపోతున్నారంటూ మెడికల్ ఆఫీసర్ నారాయణస్వామిని నిలదీశారు. రోజుకు పది మందిని సర్వే చేయాలని చెబితే ఆ పని కూడా పూర్తి చేయకపోతే ఎలా? నిర్దేశించిన లక్ష్యాలను ఎప్పటికి పూర్తి చేయాలనుకున్నారు? అంటూ అసహనం వ్యక్తం చేశారు. సాంకేతిక లోపమంటూ నెలల తరబడి తప్పించుకోవాలని చూస్తే సహించబోనని హెచ్చరించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణవేణి, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, 108 కో–ఆర్డినేటర్లు వీరారెడ్డి, సంజీవరెడ్డి, 104 కో–ఆర్డినేటర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు పట్టుబడిన గంధం చెట్ల దొంగ


దొంగను కట్టేసిన గ్రామస్తులు

రాయదుర్గం రూరల్: అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా గంధం చెట్లను నరుకుతున్న ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన మేరకు... రాయదుర్గం నివాసి ఎర్రిస్వామి.. రాయంపల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో గంధం చెట్లను సాగు చేస్తున్నాడు. గతంలో మూడు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి అపహరించుకెళ్లారు. ఈ క్రమంలోనే శనివారం వేకువజాము 2 గంటలకు గంధం చెట్లను నరుకుతున్న శబ్దం కావడంతో ఎర్రిస్వామి తోటకు ఎదురుగా ఉన్న పొలంలోని రైతు గమనించి, వెంటనే ఇరుగు పొరుగు వారిని అప్రమత్తం చేశాడు. అందరూ కలసి ఎర్రిస్వామి తోటలోకి ప్రవేశిస్తుండగా ఇద్దరు దుండగులు గమనించి, అక్కడి నుంచి పారిపోయారు. ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. పట్టుబడిన వ్యక్తిని రాయదుర్గంలోని మొలకాల్మూరు రోడ్డులో, సున్నపు బట్టీల వద్ద నివాసముంటున్న సుంకన్నగా గుర్తించారు. అప్పటికే నరికేసిన రెండు గంధం చెట్లను స్వాధీనం చేసుకుని, సుంకన్నను పట్టుకెళ్లి గ్రామంలోని విద్యుత్ స్తంభానికి కట్టేసి, శనివారం ఉదయం రాయదుర్గంలో ఉన్న తోట యజమానికి అప్పగించారు. దీంతో నిందితుడిని పోలీసుల ఎదుట రైతు ఎర్రిస్వామి హాజరు పరిచాడు. అయితే ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయకుండా విచారణ పేరుతో కాలయాపన చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇదే అంశంపై పోలీసులు మాట్లాడుతూ.. పట్టుబడిన సుంకన్న అనారోగ్యంగా ఉండడంతో కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు.

సత్ఫలితాలిస్తున్న 'సీఎంసీ'

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసుల సత్వర పరిష్కారానికి జగన్ సర్కార్ చొరవతో డీజీపీ రాజేంద్రనాథరెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చిన 'కోర్టు మానిటరింగ్ సిస్టం' (సీఎంసీ) ఆశించిన మేర ఫలితాలను అందజేస్తోంది. ఈ విధానం అమలులోకి వచ్చిన తర్వాత జిల్లాలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో అసలు దోషులను న్యాయస్థానం శిక్షిస్తూ తీర్పులు వెలువరించింది. 2015, మార్చి 31న పెద్దవడుగూరు మండలం అప్పేచెర్లలో చోటు చేసుకున్న ఫ్యాక్షన్ హత్య కేసులో నిందితులుగా ఉన్న గురుప్రసాద్, గుర్రం శ్రీనివాసులుకు ఇటీవల జీవిత ఖైదు విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అలాగే రాయదుర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని మల్కాపురంలో 2021, జూన్ 7న జరిగిన హత్యకేసులో నిందితుడిగా ఉన్న శ్రీనివాసులకు జీవితఖైదు పడింది. సీఎంసీ విధానం వల్ల సమన్ల జారీ శాతం, వారెంట్ల అమలు, న్యాయస్థానాల్లో సాక్షులను ప్రవేశపెట్టడం తదితర అంశాలు వేగవంతమయ్యాయి.

'పల్లె'కు రాజకీయ సమాధి ఖాయం

- పుట్టపర్తి అభివృద్ధిపై చర్చించడం చేతగాకే 'పల్లె' కుయుక్తులు
- వైఎస్సార్ సీపీ శ్రేణులను రెచ్చగొట్టి సానుభూతికి వెంపర్లాట
- 2024 ఎన్నికల్లో పుట్టపర్తిపై ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి


మాట్లాడుతున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రశాంతి నిలయం: ''పుట్టపర్తి ప్రాంత ప్రజలు మూడు పర్యాయాలు అధికారం ఇస్తే పల్లె రఘునాథరెడ్డి మొద్దు నిద్రలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్నారు. మందళగిరి మాలోకం లోకేష్‌తో కలసి అసత్య ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటికైనా పల్లె రఘునాథరెడ్డి ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి. లేకపోతే ప్రజలే రాజకీయ సమాధి కడతారు'' అని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాను పుట్టపర్తి నుంచి రోజూ 200 టిప్పర్లతో ఇసుకను బెంగళూరుకు తరలిస్తున్నానని, బెంగళూరు నుంచి లిక్కర్ ఇక్కడికి తీసుకువస్తున్నానని, బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నానంటూ 'యువగళం'లో లోకేష్ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేశారని, ఇది అతని దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. నిజంగా లోకేష్‌కు, పల్లె రఘునాథరెడ్డికి దమ్ముంటే నిరూపించాలన్నారు. 12 కేసులుంటేనే టీడీపీ టికెట్ అడగాలని లోకేష్ బహిరంగ సభలో చెప్పడం అతని రౌడీ సంస్కృతికి నిదర్శనమన్నారు. లోకేష్ లాంటివారు యూపీ, బిహార్‌లలో పార్టీలు పెట్టుకుంటే మంచిదని, ఏపీలో ఉండటం మన దౌర్భాగ్యమన్నారు. తాము అధికారంలోకి వచ్చాక పుట్టపర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామన్నారు. పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు చేయించి ఈ ప్రాంత శాశ్వత అభివృద్ధికి బాటలు వేశామన్నారు. నిజంగా పల్లె రఘునాథ రెడ్డికి ఈ ప్రాంత అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే.. బాలకృష్ణ హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా చేయాలని డిమాండ్ చేసినప్పుడు ఎందుకు నోరు మెదపలేదో చెప్పాలన్నారు. నిత్యం అభివృద్ధి మంత్రం జపిస్తున్న 'పల్లె' తన వ్యవసాయ కళాశాలను ఇక్కడ కాకుండా బుక్కరాయసముద్రంలో ఎందుకు ఏర్పాటు చేశారో చెప్పాలన్నారు.

మా పాలన అభివృద్ధికి నిర్వచనం..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగేళ్లుగా తాము కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. అలాగే అభివృద్ధిలో దూసుకుపోతున్నామన్నారు. అందుకే తమ పాలనను అభివృద్ధికి నిర్వచనంగా జనమే చెప్పుకుంటున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి 'ప్రజాసంకల్ప'యాత్రలో నల్లమాడ బహిరంగ సభలో ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రాంతంలో కరువును శాశ్వతంగా పారదోలేందుకు రూ.864 కోట్లతో 193 చెరువులకు హంద్రీ–నీవా ద్వారా నీటిని నింపే కార్యక్రమానికి పరిపాలనా అనుమతులు తెచ్చామన్నారు. 3 టీఎంసీల నీటిని కూడా అధికారికంగా కేటాయింపులు చేయించామన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల మీదుగా ఎన్‌హెచ్–342, గ్రీన్ ఫీల్డ్ హైవేలను నిర్మిస్తున్నామని, నియోజకవర్గంలోని నిరుపేదల కోసం 25 వేల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. అభివృద్ధిలో తనతో పోటీ పడలేకే 'పల్లె' కుట్రలు, కుతంత్రాలకు తెర తీశారన్నారు. ఆయనకు చేతనైతే అభివృద్ధిలో తమతో పోటీ పడాలని హితవు పలికారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకోకపోతే రాబోవు రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారన్నారు.

న్యాయ పోరాటం చేస్తాం..

లోకేష్ తనపై చేసిన ఆరోపణలకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి వెళ్లేలోపు ఆధారాలు చూపించాలని, లేని పక్షంలో న్యాయపోరాటం చేస్తామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. పుట్టపర్తి ప్రాంత అభివృద్ధికి, ప్రశాంతతకు తాము ఎప్పటికీ కట్టుబడి ఉంటామన్నారు. 'పల్లె' తన రాజకీయ లబ్ధి కోసం రెచ్చగొట్టే చర్యలకు దిగడం వల్లే వైఎస్సార్ సీపీ, టీడీపీ శ్రేణులు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొందన్నారు.

వృద్ధుడి అదృశ్యం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీలో నివాముంటున్న వృద్ధుడు ఆకుల శ్రీరాములు శుక్రవారం నుంచి కనిపించడం లేదు. ఆధ్యాత్మిక చింతనలో ఎక్కువగా గడిపే శ్రీరాములు... శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం ఉదయం పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

'టోల్' రుసుం పెంపు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం సమీపంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్ ప్లాజాలో వాహనాల ప్రవేశ రుసుం పెంచారు. గతంలో కారుకు రూ.60 వసూలు చేస్తుండగా.. ఈ మొత్తాన్ని రూ.5 పెంచి రూ.65కు చేర్చారు. బస్సులకు రూ.215, సరుకు రవాణా వాహనాలకు రూ.215, పది చక్రాల వాహనాలకు రూ.235 చొప్పున వసూలు చేస్తున్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

- ఉరవకొండ వృషభాలకు ప్రథమ బహుమతి

ప్రొద్దుటూరు : శ్రీరామనవమిని పురస్కరించుకుని శనివారం సీనియర్ ఎద్దులకు నిర్వహించిన బల ప్రదర్శన పోటీలు రసవత్తరంగా జరిగాయి. స్థానిక వైఎంఆర్ కాలనీలో సీతారామాంజనేయస్వామి దేవస్థాన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రారంభించారు. పోటీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన మహమ్మద్ ఆలీ, రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన ప్రసన్నరెడ్డి ఎద్దులు 2534.6 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.1,50 లక్షలను మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి అందించారు.

శేషవాహనంపై కోనరంగనాథుడు



తాడిపత్రి: మండలంలోని ఆలూరు కోనలో వెలసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా శేషవాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం ఆలయంలో విశేష పూజలు జరిగాయి. సాయంత్రం ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ చేసి శేష వాహనంపై అధిష్ఠింపజేసి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్రహ్మణ్యం, ఆలయ పాలక మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మార్కెట్‌యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శిగా జయలక్ష్మి


బాధ్యతలు తీసుకున్న జయలక్ష్మి

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి (సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ)గా ఆర్.జయలక్ష్మి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న వై.రామ్మోహన్‌రెడ్డి హిందూపురం యార్డు సెక్రటరీగా డెప్యుటేషన్‌పై బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా పెనుకొండ మార్కెట్‌యార్డు సెక్రటరీగా పని చేస్తున్న జయలక్ష్మిని ఇక్కడికి బదిలీ చేశారు. ఈమె స్వస్థలం కర్నూలు కావడంతో అనంతపురం జిల్లాపై అవగాహన ఉన్నందున యార్డు అభివృద్ధి, రైతుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని నూతన సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. అనంతరం చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సెక్రటరీని చైర్మన్, యార్డు ఉద్యోగులు పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

- డీఎల్‌డీఓ ఓబుళమ్మ ఆదేశం


సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ చిలంకూరు ఓబుళమ్మ

అనంతపురం సిటీ: వేసవిలో తాగునీటి ఎద్దడి రానీయొద్దని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ) చిలంకూరు ఓబుళమ్మ ఆదేశించారు. శనివారం అనంతపురంలోని లక్ష్మీనగర్-1 సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆమె సిబ్బందితో మాట్లాడారు. సచివాలయ పరిధిలో సమస్యలేమైనా ఉన్నాయా? అని ఆరా తీశారు. తాగునీటి సమస్య ఉంటే గుర్తించి, వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటికీ పుష్కలంగా నీరందేలా చూసే బాధ్యత సచివాలయ సిబ్బందిదేనన్నారు. ఆధార్ నవీకరణ ఎంత వరకు వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. పాన్ కార్డుతో ఆధార్ అనుసంధానానికి ప్రభుత్వం మరో మూడు నెలలు గడువు పొడిగించిందని, ఈ విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సామాజిక పింఛన్లు సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేస్తారనే విషయం విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. నీటి పన్ను త్వరితగతిన చెల్లించేలా చూడాలని కోరారు.

శ్రీగౌరీ లతకు డాక్టరేట్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని సోషియాలజీ విభాగంలో పరిశోధన చేసిన శ్రీగౌరీలతకు డాక్టరేట్ ప్రదానం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చాగంటి రామిరెడ్డి పర్యవేక్షణలో 'హెల్త్ కేర్ అండ్ న్యూట్రిషన్ స్టేటస్ ఆఫ్ ట్రైబల్ ఉమెన్' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన



మాట్లాడుతున్న సక్షమ్ జిల్లా అధ్యక్షుడు సుంకు వేణుగోపాల్

అనంతపురం సప్తగిరి సర్కిల్: సక్షమ్ ఆధ్వర్యంలో స్థానిక చలమారెడ్డి ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత కంటి శిబిరానికి స్పందన లభించింది. మొత్తం 600 మందికి కంటి పరీక్షలు చేయించారు. వారిలో 215 మంది శస్త్ర చికిత్సలకు ఎంపిక చేయగా, 30 మందికి పంపారు. కళ్లద్దాలకోసం 45 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో సక్షమ్ జిల్లా అధ్యక్షుడు సుంకు వేణుగోపాల్, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల కరస్పాండెంట్ పీఎల్ఎన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్, సక్షమ్ ట్రెజరర్ జయచంద్రారెడ్డి, కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సస్పెన్షన్ ఎత్తివేయాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేశారు. నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సస్పెన్షన్ ఉత్తర్వుల ప్రతిని దహనం చేస్తూ నిరసనలు తెలియజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓ పరమేష్ మాట్లాడుతూ వర్సిటీ అధికారుల వైఫల్యాన్ని ఎండగడుతున్న ఎస్ఎఫ్ఐ (నలుగురు విద్యార్థులు) నాయకులపై ఉద్దేశ పూర్వకంగానే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గిరి, గౌసియా, రజిత, కిరణ్, వినోద్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


నారాయణపురంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏనారాయణపురం పంచాయతీ పరిధిలోని తపోవనంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌తో కలిసి ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల లబ్ధి, స్థానిక సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేయడంతోనే తమపైనా, ప్రభుత్వంపైన ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు సజావుగా అందించామన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకుల దయ ఉంటేనే సంక్షేమ పథకాలు అందేవన్నారు. ఎలాంటి సిఫార్సులు లేకుండానే సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తుంటే ప్రతిపక్ష నాయకులు, ఎల్లో మీడియా ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా 2024 ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారన్నారు.

నగరానికి దీటుగా పంచాయతీల అభివృద్ధి..

నియోజకవర్గ పరిధిలోని నాలుగు పంచాయతీలను నగరానికి దీటుగా అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఈమూడున్నరేళ్లలోనే దాదాపు రూ. 600 కోట్లతో నియోజకవర్గంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నాలుగు పంచాయతీల్లో గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రూ. 80 కోట్లతో చేశామన్నారు. రాబోవు రోజుల్లో మరింత అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ఎంటీసీ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, మల్లెల వేణుగోపాల్, బి. మదన్‌మోహన్‌రెడ్డి, కృష్ణవేణి, హాజీవలి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వే పక్కాగా చేయాలి


సర్వేను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం/అనంతపురం సప్తగిరి సర్కిల్ : నడిమివంకకు సంబంధించి చేస్తున్న సర్వే పక్కాగా ఉండాలని టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీ శ్రీనివాసులు రెడ్డిని మేయర్ వసీం ఆదేశించారు. నగరంలోని 48వ డివిజన్ పరిధిలోని గౌరవగార్డెన్ వద్ద (125 సర్వే నంబర్) జరుగుతున్న సర్వేను మేయర్ పరిశీలించారు. నడిమివంకపై ఎక్కడైనా ఆక్రమణలుంటే, వాటి తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది భారీ వర్షాలతో నడిమివంక మీదుగా వర్షపు నీరు సరిగా వెళ్లకపోవడంతో నీరు రివర్స్‌లో ఇళ్లలోకి చేరిందని, ఆసమయంలో ఎమ్మెల్యే అనంత ప్రత్యేక చొరవతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారన్నారు. సర్వేయర్ ప్రభాకర్, డీఈ రాంప్రసాద్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాసులు, అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలికి నివాళి..

నగర పాలక సంస్థలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ కార్మికురాలు లక్ష్మీదేవి మృతికి నగర మేయర్ వసీం సంతాపం ప్రకటించారు. శనివారం స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో లక్ష్మీదేవి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. తక్షణ సాయం కింద రూ.15 వేలు అందించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ రమణారెడ్డి, కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డి, ఎంహెచ్ఓ గంగాధర్ రెడ్డి, నాయకులు ఖాజా, యూనియన్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో 'అనంత' మూడోస్థానం

అనంతపురం క్రైం: ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్ను వసూళ్లలో నగరపాలక సంస్థ రాష్ట్ర స్థాయిలో మూడు స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని 17 నగర పాలక సంస్థల్లో మంగళగిరి, కర్నూలు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. గతేడాది అనంతపురం నగర పాలక సంస్థ 2021–22లో పన్ను రూ.34.33 కోట్లు వసూలైంది. ఈ ఆర్థిక సంవత్సరం (2022–23) నగరంలోని 59,397 అసెస్‌మెంట్లకు గానూ రూ.48.43 కోట్ల పన్ను వసూలైంది. గతేడాదితో పోలిస్తే 41 శాతం పన్ను అదనంగా వసూలైంది.

రూ.6.09 కోట్లు వడ్డీ మాఫీ..

కోవిడ్ విపత్కర పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం గత నెల 17 నుంచి పన్ను బకాయి ఒకే సారి చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని ప్రకటించింది. అప్పటినుంచి కమిషనర్ రమణారెడ్డి ఆదేశాలతో సిబ్బంది ప్రణాళికతో మొండిబకాయిదారుల ఇళ్లవద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. బకాయిదారులు ప్రభుత్వం అందించిన సువర్ణవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. 15 రోజుల్లో(గత నెల 17 నుంచి 31వరకు) రూ.13,70,7594 (రూ.13.70 కోట్లు) వసూలైంది. బకాయిదారులు ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో పన్ను చెల్లించడంతో వారికి రూ.6,09,6413 (రూ.6.09 కోట్లు) వడ్డీ మాఫీ అయ్యింది. పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి పెద్ద ఎత్తున వసూలు చేసిన రెవెన్యూ విభాగం, సచివాలయ అడ్మిన్, ఎడ్యుకేషన్, పట్టణ ప్రణాళిక, వెల్ఫేర్, పోలీసు, తదితర సిబ్బందికి కమిషనర్ రమణారెడ్డి అభినందనలు తెలియజేశారు.

వాల్మీకులు రాజకీయంగా ఎదగాలి

- ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు రాజారాం


నూతనంగా ఎంపికైన నియోజకవర్గ వాల్మీకి సంక్షేమ సంఘం సభ్యులు

రాప్తాడు: వాల్మీకులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు రాజారాం పేర్కొన్నారు. శనివారం స్థానిక పండమేటి రాయుడు ఆలయంలో నియోజకవర్గ స్థాయి వాల్మీకి సంక్షేమ సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రాజారామ్ మాట్లాడుతూ వాల్మీకి బోయలు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. వారిని అన్నివిధాలుగా ఆదుకునేందుకు జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వాల్మీకి సంక్షేమ సంఘం నియోజకవర్గ ప్రెసిడెంట్ బోయ రామాంజనేయులు మాట్లాడుతూ వాల్మీకులు అగ్రవర్ణాల వారి కింద బానిసలుగా బతికారన్నారు. వాల్మీకుల్లో చైతన్యం తీసుకొచ్చి వారి సమస్యలను పరిష్కరించేందుకు వాల్మీకి సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాల్మీకుల సమస్యలను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం నియోజకవర్గ వాల్మీకి సంక్షేమ సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ వాల్మీకి సంక్షేమ సంఘం నూతన ప్రెసిడెంట్‌గా బోయ రామాంజనేయులు, వైస్ ప్రెసిడెంట్‌గా కుట్టి మద్ది రమేష్, జనరల్ సెక్రటరీగా మోహన్‌బాబు, సెక్రటరీగా అంకే అశోక్, మందల నరసింహులు, ట్రెజరర్‌గా శ్రీనివాసులును ఎంపిక చేశారు.

రేపు మృత్యుంజయ హోమం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని వీసీ అధికార నివాసంలో సోమవారం మృత్యుంజయ హోమం నిర్వహించనున్నట్లు అధికారవర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. ఉదయం 9:30 గంటలకు సంకల్పం,మధ్యాహ్నం 12:40 గంటలకు పూర్ణాహుతి, 1 గంటకు ప్రసాదం పంపిణీ తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపాయి.

శ్రీరాముడికి ప్రత్యేక పూజలు

తాడిపత్రి టౌన్: స్థానిక ఏటిగడ్డపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామ నవమి వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం రాత్రి శ్రీరామ చంద్రుడు వరాహ అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారు, స్వామి ఉత్సవ విగ్రహాలకు జలాభిషేకం, క్షీరాభిషేకం అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరించారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

తాడిపత్రి టౌన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఈనెల 17 నుంచి పాలిసెట్ -2023 ప్రవేశ పరీక్ష రాయనున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మే 10న జరగనున్న పాలిసెట్-2023 ప్రవేశ పరీక్షకు ఈనెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9989160103, 9494931219 నంబర్లలో సంప్రదించాలన్నారు.

హరిద్వార్‌లో అన్నవసతి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విశాఖ శ్రీశారదా పీఠాధిపతి, ఏపీ ఎండోమెంట్ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్

అనంతపురం కల్చరల్: హరిద్వార్‌లో గంగా పుష్కరాలకు వెళ్లే అనంతవాసులకు సాయిట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేయనున్నట్లు ఏపీ ఎండోమెంట్ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. శనివారం విజయవాడలో గంగాపుష్కరాల సందర్భంగా సాగే అన్నదాన పోస్టర్లను విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిస్వామి, జ్వాలాపురం శ్రీకాంత్ తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధి విజయ్‌సాయి మాట్లాడుతూ హరిద్వార్‌లో గంగా పుష్కరాల్లో ఈనెల 22 నుంచి మే 3 వరకు గంగా మహాసభ ప్రాంతంలో అన్నదానం చేస్తున్నామన్నారు. అనంతరం దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ తదితరులు వేర్వేరు చోట్ల కరపత్రాలు ఆవిష్కరించారు.

30 మంది ఉద్యోగాలకు ఎంపిక

అనంతపురం: ఓటీపీఆర్ఐ (జేఎన్‌టీయూ అనంతపురం)లో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మొత్తం 30 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ తెలిపారు. హెటిరో కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మొత్తం 80 మంది బీఫార్మసీ, ఎంఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను డైరెక్టర్‌తో పాటు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్కా గోపీనాథ్ అభినందించారు. కార్యక్రమంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కోఆర్డినేటర్స్ ఎం.మహేశ్, డాక్టర్ ఈ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పరిశోధనలే గీటురాయి


ఎలక్ట్రానిక్స్ విభాగంలో రీసెర్చ్ రివ్యూను పరిశీలిస్తున్న వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: నాణ్యమైన పరిశోధనలే వర్సిటీ గుర్తింపునకు గీటురాయి అని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలోని పలు విభాగాల్లో రీసెర్చ్ రివ్యూ మీటింగ్ (పరిశోధన సమీక్ష) నిర్వహించారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ పర్యవేక్షించారు. వీసీ మాట్లాడుతూ ప్రతి విభాగంలోనూ సమీక్ష కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. నిర్దేశించిన గడువులోపు పీహెచ్‌డీ పూర్తి చేసేలా పరిశోధన విద్యార్థులు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కంప్యూటర్ సైన్సెస్, ఎంబీఏ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఫిజిక్స్, మేథమేటిక్స్ విభాగాల్లో రీసెర్చ్ రివ్యూ మీటింగ్ జరిగింది. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ శోభాబిందు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ కేశవరెడ్డి, డాక్టర్ జి.మమత, డాక్టర్ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పాదరక్షల పంపిణీ

అనంతపురం కల్చరల్: వందలాది మంది పాదచారులకు పాదరక్షలు పంపిణీ చేసినట్లు రేమా చర్చి ప్రతినిధులు పాస్టర్ మనుష్యే, బ్రదర్ బాలరాజు శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మంచినీటి సౌకర్యం, మజ్జిగ పంపిణీ చేస్తామని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


ఏజెన్సీలకు సూచనలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇళ్ల నిర్మాణాల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కమిషనర్ రమణారెడ్డి ఏజెన్సీ నిర్వాహకులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థలో ఇళ్ల నిర్మాణాలపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. పలు చోట్ల నిర్మాణాలు ప్రారంభంకాకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలమూరు, కొడిమి, సిద్ధరాంపురం బీ.సీ.డీలో జరుగుతున్న నిర్మాణాలపై అడిగి తెలుసుకున్నారు. కురుకుంట లే అవుట్‌లోనూ పనులు ప్రారంభించాలని మినాక్షి ఏజెన్సీ వారిని ఆదేశించారు. రాచానపల్లి, తాటిచెర్లలో కరెంటు సమస్యను నివృత్తి చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు కమిషనర్ ఆదేశించారు. నగరంలో జరుగుతున్న వివిధ స్థాయిల్లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసేలా చూడాలని ఇంజినీర్లను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సావిత్రి, ఎస్ఈ సతీష్‌చంద్ర, ఈఈలు రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్, హౌసింగ్ డీఈ కృష్ణారావు పాల్గొన్నారు.

మార్పుకోసం తపించిన రచయిత సింగమనేని

- డిప్యూటీ మేయర్ 'కోగటం'


మాట్లాడుతున్న కోగటం విజయభాస్కరరెడ్డి

అనంతపురం కల్చరల్: సమాజ మార్పుకోసం సింగమనేని నారాయణ పరితపించారని, జిల్లా కరువు పరిస్థితులను కళ్లకు కట్టినట్టు కథల రూపంలో వెలుగులోకి తెచ్చారని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి అన్నారు. శనివారం గుర్రం జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత సింగమనేని నారాయణ ద్వితీయ వర్ధంతి సందర్భంగా సాహితీ సదస్సు జరిగింది. స్థానిక నాల్గోరోడ్డులోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి దగ్గుపాటి ప్రకాష్‌రావు అధ్యక్షత వహించారు. కోగటంతో పాటు ఆచార్య బాలసుబ్రమణ్యం, విశ్రాంత ప్రిన్సిపాల్ రంగస్వామి తదితరులు సింగమనేనితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సింగమనేని రాసిన జాలువారిన జూదం, అడుసు, ఒక పయనం, కొత్త అల్లుడు అందరూ చదవాల్సిన కథలన్నారు. అనంతరం కోగటం విజయభాస్కరరెడ్డి శ్రీశ్రీ మహాప్రస్థానంలోని కవితలను భావయుక్తంగా చదివి వినిపించిన తీరు ఆకట్టుకుంది.

వైఎస్సార్‌సీపీతోనే నాయీబ్రాహ్మణుల అభివృద్ధి


మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు

అనంతపురం క్రైం: వైఎస్సార్‌సీపీతోనే నాయీబ్రాహ్మణులు అభివృద్ధి చెందుతున్నారని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని పలువురు నాయీ బ్రాహ్మణులు విమర్శలు చేయడాన్ని వీరు తప్పుపట్టారు. శనివారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయీబ్రాహ్మణులకు అందించిన సంక్షేమ పథకాలను ఆయన తెలియజేశారు. ఉచిత కరెంటు, సంక్షేమ పథకాలు, కులదూషణ జీవో నంబర్ 50, ప్రతి ఆలయ పాలక మండలి కమిటీలో సభ్యుడిగా నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. టీడీపీ హయాంలో ఓటు బ్యాంకు కోసమే తమను వాడుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే అనంత తనకు రాష్ట్ర డైరెక్టర్‌గా అవకాశం కల్పించారని, నాయీ బ్రాహ్మణులు నలుగురికి స్టోర్ డీలర్లు, ఆర్‌పీ, అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా ఇలా ఎన్నో అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు, పార్టీ నాయకులు జీఎం విజయ్‌కుమార్, రామకృష్ణ, బంకు శ్రీనివాసులు, సూరి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొడిమి, కృష్ణంరెడ్డిపల్లిలో వనభోజనాలు


కృష్ణంరెడ్డిపల్లిలో వనభోజనాలకు వెళ్తున్న గ్రామస్తులు


కొడిమిలో వన భోజనాలకు వెళ్లడంతో ఊరిలోకి బయటవాళ్లు రాకుండా కాపలా ఉన్న తలారి శ్రీరాములు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కృష్ణంరెడ్డిపల్లి, కొడిమి గ్రామాల్లో శనివారం వన భోజనాలకు వెళ్లారు. ఊరంతా వన భోజనాలకు వెళ్తే ఊరికి శాంతి కలుగుతుందనే నమ్మకంతో ఏటా వన భోజనాలకు వెళ్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సూర్యోదయమే ఇళ్లకు తాళాలు వేసి, ఊరు బయట చెట్లకిందకు చిన్నాపెద్దా అందరూ వెళ్లారు. వంటలు చేసుకొని, ఆరగించి సాయంత్రం వరకు అక్కడే సరదాగా గడిపారు. కొత్తవాళ్లు రాకుండా అన్ని దారులూ మూసివేసి, కాపలా ఉన్నారు. సాయంత్రం అందరూ ఊరేగింపుగా గ్రామంలోకి చేరుకున్నారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో చైతన్య విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులతో ఏజీఎం సుబ్బారెడ్డి

రాప్తాడురూరల్: ఐఎన్‌టీఎస్ఓ ఒలింపియాడ్ రెండో లెవల్ పరీక్షల్లో అనంతపురం జోన్ చైతన్య పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. గ్రాండ్, గోల్డ్ మెడల్స్, కాన్సొలేషన్ ప్రైజులు, మెరిట్ సర్టిఫికెట్లు పొందారని ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం కమ్మభవన్ సమీపంలోని చైతన్య స్కూల్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఒకటో బ్రాంచ్‌కు చెందిన హేమంత్ వెంకట సాయి (5వ తరగతి), 5వ బ్రాంచ్ ప్రణీత్ (8వ తరగతి), 6వ బ్రాంచ్ సాయి చరణ్ వర్షిత్, సీబీఎస్ఈ బ్రాంచ్ లక్షిత్ (8వ తరగతి) గ్రాండ్ ప్రైజులు గెలుచుకున్నారని ఏజీఎం తెలిపారు. 13 మంది మొదటి బహుమతి, ముగ్గురు 2వ బహుమతి, 12 మంది 3వ బహుమతి, 15 మంది 4వ బహుమతి, 29 మంది 5వ బహుమతి, 510 మంది కాన్సొలేషన్ ప్రైజ్, 71 మంది స్పెషల్ ప్రైజు, 326 మంది గోల్డ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్స్, 183 మంది గోల్డ్ మెడల్స్, 2,389 మంది మెరిట్ సర్టిఫికెట్లు సాధించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు విశ్వనాథ్, తబస్సుమ్, ఖలందర్, షమీనాఖాన్, పర్వీన్ బాను, వెంకటేష్, నేత్రావతి, శాంత, శ్రీదేవి, స్వరూప, కోఆర్డినేటర్ రాధాకృష్ణ, తిరుమలేష్, శ్రీనివాస్, డీన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమద్వాహనంపై ఊరేగిన రామచంద్రుడు


నగరవీధుల్లో స్వామివారి దర్శనం

అనంతపురం కల్చరల్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారంరాత్రి కోదండరాముడు సతీసమేతుడై హనుమద్ వాహనంపై నగరవీధుల్లో ఊరేగి దర్శనమిచ్చాడు. స్థానిక మొదటిరోడ్డు కోదండ రామాలయంలో అంతకు ముందు ఆలయంలో సీతారామాంజనేయులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకార సేవలు జరిగాయి. కళాకారుల సాంస్కృతిక సంబరాలు ఆకట్టుకున్నాయి. పాతూరులోని ప్రాచీన దత్తాత్రేయ స్వామి దేవస్థానంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది. లోక కల్యాణార్థం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.